క్లుప్తంగా

క్రీడాసామగ్రి అందజేత



ఇందల్వాయి : గన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్అండ్‌పీ మల్టీ నేషనల్ కంపెనీ రూ. 80 వేల క్రీడాసామగ్రిని శనివారం ఉచితంగా అందజేసింది. గ్రామానికి చెందిన కుంట రాజారెడ్డి గన్నారం పాఠశాలలో చదివి ఎస్అండ్‌పీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తాను చదివిన పాఠశాలకు ఏదైనా చేయాలనే ఉద్దేశంతో ఎస్అండ్‌పీ హైదరాబాద్ యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రి అందించినట్లు సర్పంచ్ మోహన్ రెడ్డి తెలిపారు. ఉప సర్పంచ్ భైరయ్య, హెడ్‌మాస్టర్ వీరలక్ష్మి, వార్డు మెంబర్లు, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలకు లోబడి డిప్యుటేషన్లు చేయాలి

నిజామాబాద్ అర్బన్ : మార్గదర్శకాలకు లోబడి టీచర్ల డిప్యుటేషన్లు చేపట్టాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. దీర్ఘకాలంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టని కారణంగా కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెలువరించిన మార్గదర్శకాలకు లోబడి డిప్యూటేషన్లు పెట్టాలని అందుకు అనుగుణంగా జిల్లా విద్యాశాఖ స్పష్టమైన మార్గదర్శకలను మండల విద్యాశాఖ అధికారులకు జారీ చేయాలన్నారు.

ఎల్ఓసీ అందజేత



జక్రాన్‌పల్లి : జక్రాన్‌పల్లి మండలం కలిగోట్‌కు సందీప్ ఇటీవల బైక్ యాక్సిడెంట్‌లో గాయపడగా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ యువ నాయకులు బాజిరెడ్డి జగన్ యువకుడికి ఆర్థిక సాయం అందించారు. అలాగే వైద్యం కోసం నిమ్స్‌లో చేర్పించి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 2 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. రూ. 2 లక్షల ఎల్‌వోసీ కాపీని శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే నివాసంలో బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

తెయూలో సమస్యలు పరిష్కరించాలి

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : తెయూ సమస్యలకు నిలయంగా మారిందని, విద్యార్థులకు కనీస వసతులు కల్పించలేకపోతున్నారని టీయూ ఎంఎస్ఎఫ్ ఇన్‌ఛార్జి దుర్గం సురేశ్ విమర్శించారు. శనివారం డిచ్‌పల్లి మండలంలోని తెయూలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ టీయూలో రెండు, మూడు విభాగాల్లో తప్ప మిగితా విభాగాల్లో తరగతులు నిర్వహించడం లేదన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



నిజామాబాద్‌నాగారం : శ్రీలక్ష్మీ చేయూత సేవా సమితి ఆధ్వర్యంలో ఓ పేద కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. శనివారం నగరంలోని ఆర్టీసీ కాలనీ సమీపంలో ఉన్న మహాలక్ష్మి నగర్‌కి చెందిన సాయిలు భార్య ఇటీవల మృతి చెందారు. దీంతో పాటు సాయిలుపై ఇసుక లారీ బోల్తా పడి కాలు విరిగి రాడ్లు వేశారు. దీంతో నడవలేని స్థితిలో ఉన్న ఆయన కుటుంబానికి లక్ష్మి చేయూత సేవా సమితి సభ్యులు రెండు నెలలకు సరిపడే కిరాణా సామగ్రిని, చేతి ఖర్చులకు రూ. 2 వేలు సాయం చేశారు. ప్రధాన కార్యదర్శి అలువాల లక్ష్మణ్, కార్య నిర్వాహక సభ్యుడు తాటి శ్యాం కుమార్‌లున్నారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ



నిజామాబాద్ సిటీ : స్థానిక జెండా బాలాజీ మందిరంలో శనివారం రాత్రి పల్లకీసేవ జరిగింది. ఈ కార్యక్రమంలో వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయంలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామ స్మరణతో ఆలయం మారుమోగింది.

వాసవి వనిత క్లబ్ సేవలు మరువలేనివి

నిజామాబాద్ నాగారం : వాసవి వనిత క్లబ్ సేవలు మరువలేనివని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ యమ దయాకర్ అన్నారు. శనివారం కన్యాకా పరమేశ్వరాలయంలో వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా దయాకర్ హాజరై మాట్లాడుతూ వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. వాసవి క్లబ్ రీజినల్ చైర్ పర్సన్ గాదె సుదర్శన్‌గుప్త, వాసవి క్లబ్ క్యాబినెట్ సెక్రటరీ బొంపల్లి రాజు తదితరులున్నారు.

లబ్ధిదారుల ఎంపికపై ఉత్కంఠ

- రూ.లక్ష సాయం దరఖాస్తులు 706
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ముగిసిన గడువు
- 14 చేతివృత్తులతో పాటు ఎంబీసీలకు అవకాశం
- పరిశీలిస్తున్న అధికారులు



దరఖాస్తుపత్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో లింగం నాయక్, సిబ్బంది

మోపాల్ (నిజామాబాద్‌రూరల్) : బీసీ సామాజిక వర్గంలోని 14 కులవృత్తులతోపాటు ఎంబీసీలకు ప్రభుత్వం రూ. లక్ష ఆర్థిక సాయం చేసేందుకు ఈనెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. మోపాల్ మండలంలో మొత్తం 706 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం ఎంపికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇంకా కొందరు దరఖాస్తు పత్రాలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఎంపీడీఓ కార్యాలయ అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు.రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

21 గ్రామ పంచాయతీలు..

మండలంలో 21 గ్రామపంచాయతీలు ఉండగా, అందులో 8 తండాలు ఉన్నాయి. ఇప్పటివరకు 706 మంది 14 కులవృత్తులు, ఎంబీసీలు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 326 మంది పురుషులు, 380 మంది మహిళలు ఉన్నారు. కానీ ఇప్పటివరకూ 520 మంది మాత్రమే దరఖాస్తుపత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశారు. దరఖాస్తుపత్రాలను కార్యాలయంలో అందజేసేందుకు మరో రెండు, మూడురోజులు గడువు ఇచ్చారు. దరఖాస్తుదారులు కులం, ఇన్‌కమ్, ఇతర ధ్రువీకరణ పత్రాలకు మీసేవాల్లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ పత్రాల కోసమే ఆలస్యమౌతుందని దరఖాస్తుదారులు పేర్కొంటున్నారు. అధికారులు స్వీకరించిన దరఖాస్తులను ఎంపీడీఓ, సిబ్బంది పరిశీలిస్తున్నారు.

ఎంపికకు మార్గదర్శకాలు..

లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో ఎంపీడీవో ఆధ్వర్యంలో కమిటీ ఎంపిక చేసి, బీసీ వెల్ఫేర్ శాఖకు దరఖాస్తులను పంపించనుంది. చేతి వృత్తుల వారితోపాటు సంచార జాతుల వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంది. స్థానికంగా ఉంటూ నిరుపేదలైన వారిని ప్రత్యేకంగా గుర్తించి రూ.లక్ష సాయం అందించాలని సూచించింది. 14 కులాలతోపాటు ఎంబీల్లో దివ్యాంగులు, ఒంటరి మహిళలు, నిరుద్యోగు యువతకు ప్రాధాన్యత నివ్వాలని తెలిపింది. రూ.2లక్షల్లోపు ఆదాయం ఉండాలని పేర్కొంది. దరఖాస్తు చేసుకున్న వారిలో అధికమందికి రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం సానుకూలంగా ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

త్వరలో ఎంపిక ప్రక్రియ

ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారి పత్రాలు పరిశీలిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశానుసారం త్వరలోనే ఎంపిక ప్రక్రియ చేపడుతాం. ఇంకా కొందరు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఎదురుచూస్తు దరఖాస్తుపత్రాలు సమర్పించలేదు. సోమ, మంగళ వారాల్లోపు అందజేయాలి.

– లింగం నాయక్, ఎంపీడీవో, మోపాల్



దూస్‌గాంలో బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

వైభవంగా పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : డిచ్‌పల్లి మండలంలోని దూస్‌గాంలో వన దుర్గాదేవి, పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను ముదిరాజ్ కులస్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మ తల్లికి అభిషేకం, యజ్ఞ కార్యక్రమాలు చేశారు. సాయంత్రం బోనాలతో ఊరేగింపుగా పెద్దమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాయ లింగయ్య, ప్రధానకార్యదర్శి గుర్రపు బాలయ్య, సభ్యులు రాయ పెద్ద సాయిలు, లింబాద్రి, గంగాధర్, షేరు రాజు, శ్రీనివాస్, ప్రమోద్, రవి, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మైనారిటీలను మోసం చేస్తున్న బీఆర్ఎస్



మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నేత సయ్యద్ ఖైసర్

ఖలీల్‌వాడి : మైనారిటీలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత, మైనారిటీ నేత సయ్యద్ ఖైసర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌భవన్‌లో ఆయన మాట్లాడారు.సీఎం కేసీఆర్ మైనారిటీ వర్గాలకు చెందిన వారికి విద్యా, ఉపాధి, ఉద్యోగవకాశాలు కల్పించలేదని విమర్శించారు. నగరంలోని ధర్మపురి హిల్స్‌లోని శ్మశానవాటిక 3.20 ఎకరాలు భూమి ఉంటే కొంతమంది కబ్జాదారులు దానిని ఆక్రమించడానికి ప్రయత్నించినట్లు ఆరోపించారు. ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా చెరువులను కూడా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాలను అధికార పార్టీ నేతలు కబ్జా చేస్తున్న జిల్లాలోని ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. సిక్కులకు శ్మశాన వాటిక గాని వారికి కమ్యూనిటీ హాల్స్ గాని లేవన్నారు. నాలుగేళ్ల క్రితం ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలకు వినతి పత్రం ఇచ్చిన ఇప్పటీ వరకు స్పందన లేదన్నారు. మైనారిటీలకు ఎడ్యుకేషన్, లైబ్రరీ, కమ్యూనిటీ హాల్‌లు, ఆటల కోసం గ్రౌండ్స్ ఏర్పాటు చేయాలని రోబోయే రోజుల్లో మైనారిటీలు బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. బోధన్‌లో 13 ఏళ్ల బాలికపై ఆత్యాచారానికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా ఉన్న ఆన్సారీ ఆ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో మైనారిటీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఉబెద్ బిన్ హందన్ తదితరులు ఉన్నారు.

తిలక్‌గార్డెన్‌ను అభివృద్ధి చేస్తాం

- వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



సమావేశంలో పాల్గొన్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

నిజామాబాద్‌నాగారం : బృంద సభ్యులందరం కలిసి తిలక్‌గార్డెన్‌ను అభివృద్ధి చేసుకుంటామని సీనియర్ సిటిజన్స్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం తిలక్‌గార్డెన్ వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా నగరం నడిబొడ్డున ఉన్న తిలక్ గార్డెన్ సీనియర్ సిటిజన్లకు, వాకర్ అసోసియేషన్ సభ్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. సీనియర్ సిటిజన్స్ సౌకర్యార్థం రోడ్డుకు ఇరువైపులా గుంతలను పూడ్చాలని, స్విమ్మింగ్‌పూల్ ముఖ్యంగా వయసు పైబడిన వారికి వాకింగ్ చేసే సమయంలో రోడ్డు ఇరువైపులా ఉన్న గుంతలను సరిచేయాలని, తిలక్‌గార్డెన్‌లో సిమెంట్ రోడ్డు వేయాలని, స్విమ్మింగ్‌పూల్‌తో పాటు మినీ జిమ్ మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించారు. అంతకుముందు తిలక్‌గార్డెన్‌లో వాకర్ అసోసియేషన్ సభ్యులు కొందరు మృతి చెందగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ సమావేశంలో తిలక్ గార్డెన్ వాకర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అడ్వకేట్ తుల గంగాధర్, ఎడ్ల ధనరాజ్, ప్రతినిధులు కష్టయ్య, ఉమారుద్దీన్, ఆరిఫొద్దీన్, సుధాకర్ శివ ప్రసాద్, బాబురావు, చంద్రరెడ్డి, రంగారావు, బాపురెడ్డి, లక్ష్మణ్ రావు, ముంతాజ్, అక్తర్ తదితరులున్నారు.

ఘనంగా జగదాంబ సంస్మరణ దినోత్సవం



నిజామాబాద్ సిటీ: ఈశ్వరీయ విశ్వ విద్యాలయ తొలిసారధి జగదాంబ మమ్మా సంస్మరణ దినోత్సవాన్ని నగరంలోని నాందేవ్‌వాడ బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాందేవ్‌వాడ కేంద్రం నిర్వాహకురాలు సునీత బహెన్ జీ మాట్లాడుతూ ఈశ్వరీయ జ్ఞాన బీజాక్షరాలను లిఖించిన శారదా దేవి బ్రహ్మ ముహూర్తంలో రెండు గంటలకే మేల్కొని పరమాత్మ శివుడితో అఖండ యోగం చేసిన మహా తపస్వీమూర్తి అని అన్నారు. చేసిన తప్పులు పునరావృతం కాకుండా ధృడసంకల్పంతో జీవితంలో పరివర్తనకు నాంది అని పలికిన మమ్మా ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఎప్పటికి నిలిచిపోతుందన్నారు. అనంతరం చిన్నారులకు సునీత బహెన్ జీ పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతి బహెన్ జీ, శ్రీనివాస్, వైకుంఠం, విజయలక్ష్మీ మాతాజీ, స్టూడెంట్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం



మోపాల్(నిజామాబాద్‌రూరల్) : డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ పాఠశాలలో శనివారం క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. ఈనెల 13 నుంచి 17 వరకు తైవాన్ దేశంలోని తైపిలో జరిగిన ఏషియన్ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో భారత జట్టు తరపున పాల్గొన్న జిల్లా క్రీడాకారులు ఎస్ సౌమ్యరాణి (కెప్టెన్), జి సౌందర్య, జి సాత్విక, జి శ్రావిక, డి సరయు ఉత్తమ ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ గోదావరి తెలిపారు. సుద్దపల్లి పాఠశాల క్రీడామైదానంలో ఆడిన క్రీడాకారులు అంతర్జాతీయ పోటీల్లో రాణించడం పట్ల ఆమె సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గంగామోహన్, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి వాణి, వనిత, పీఈటీలు నల్లూరి లత, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వేముల మౌనిక క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వర్ధంతి సభ పోస్టర్ల ఆవిష్కరణ

నిజామాబాద్‌నాగారం : సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ డి.వి.కృష్ణ ప్రథమ వర్ధంతి సభ పోస్టర్లను నగర కమిటీ ఆధ్వర్యంలో నగర కార్యదర్శి సుధాకర్ శనివారం ఆవిష్కరించారు. ప్రథమ వర్ధంతి సభ 26న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందన్నారు. పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే. సంధ్యారాణి, పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేశ్ తదితరులున్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నగరంలో ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ముదిరాజ్‌లు



ధర్పల్లిలో..

నిజామాబాద్‌నాగారం : ముదిరాజులను కులం పేరుతో దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ముదిరాజ్ సభ ఆధ్వర్యంలో నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22న హుజురాబాద్ నియోజకవర్గంలో మున్సిపల్ సిబ్బంది అమరవీరుల స్తూపం కూల్చివేత సందర్భంగా ఒక మహిళ ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డితో సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలం చెందిందని ఆరోపించారు. అక్కడే ఉన్న ఓ ప్రైవేట్ యూట్యూబ్ ఛానల్ ముదిరాజ్ కులస్తుడు అక్కడ విషయాలు వీడియో తీస్తుండగా గమనించిన ఎమ్మెల్సీ.. కెమెరాని లా క్కోవడంతో పాటు అతన్ని కులం పేరుతో దూషించి బెదిరించారన్నారు. ఎమ్మెల్సీ క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు కరాటే రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి : మండల కేంద్రంలోని గాంధీ చౌక్ లో శనివారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను మండల ముదిరాజ్ సంఘం నాయకులు దహనం చేశారు. అధ్యక్షుడు రఘురాం తదితరులు ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిపై ధర్పల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

జక్రాన్‌పల్లి : ముదిరాజులపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శనివారం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను ముదిరాజ్‌లు దహనం చేశారు. ముదిరాజ్ సంఘం నాయకులు డిష్ రాజు, సూపర్ వినోద్, రాజేందర్, కార్తీక్, ప్రసాద్, శివ, నరేష్, మహేశ్ పాల్గొన్నారు.

ఇందల్వాయి : ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో మండల ముదిరాజ్ సంఘ సభ్యులు ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిపై శనివారం ఫిర్యాదు చేశారు. కౌశిక్ రెడ్డిని వెంటనే ఎమ్మెల్సీ పదవి నుండి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు ముచ్చె గోపాల్, దామ నర్సయ్య, సంబెటి రవీందర్, ఎర్ర సాయిలు, గంగారం తదితరులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లిలో..



ఇందల్వాయిలో ఎస్సైకి వినతిపత్రం..

ఈగ గంగారెడ్డికి పరామర్శ



ఈగ గంగారెడ్డిని పరామర్శిస్తున్న సుదర్శన్ రెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : నగరశివారులోని బోర్గాం(పి)లో బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఈగ గంగారెడ్డిని ఆయా పార్టీల నాయకులు శనివారం పరామర్శించారు. ఆయన తల్లి ఈగ గంగమ్మ మృతి పట్ల వారు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ మేయర్ ఆకుల సుజాత, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బీన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, నాయకులు ముప్ప గంగారెడ్డి, అంతిరెడ్డి రాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి..

సుభాష్‌నగర్ : బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్ తండ్రి రాజేశ్వర్ ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబాన్ని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా శనివారం పరామర్శించారు. రాజేశ్వర్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, శివప్రసాద్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట ఎస్సీ మోర్చా నాయకులు ఉన్నారు.



శివప్రసాద్‌ను పరామర్శిస్తున్న కొప్పు భాషా

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

ధర్పల్లి : మండలంలోని కాలేజ్ తండాలో రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎంపీపీ సారిక హనుమంతు రెడ్డి, సర్పంచ్ మంజుల నరేష్ శనివారం భూమిపూజ చేశారు. సొసైటీ చైర్మన్ చిన్నారెడ్డి, ఉపసర్పంచ్ అన్వేష్ ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఖలీల్‌వాడి: రూరల్‌పోలీస్‌స్టేషన్ పరిధిలోని పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి దాడులు చేశారు. 18 మందిని అదుపులోకి తీసుకుని వీరి నుంచి రూ. 71,000, ఐదు బైక్‌లు, 19 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. రూరల్‌ఎస్సై లింబాద్రికి నిందితులను అప్పగించి కేసు నమోదు చేశారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	60,500	వెండి (కిలో)	72,700
22 క్యారెట్స్	55,777	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	240
		లైవ్	180
స్కిన్‌లెస్	280	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	40	60	క్యాప్సికం	40	60
బెండకాయ	25	50	గాజరుగడ్డ	30	50
జీరకాయ	40	60	పచ్చిమిర్చి	60	80
దొండకాయ	20	40	దోసకాయ	20	40
బీర్నీసుకాయ	100	130	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిగడ్డ	15	30
వంకాయ	30	50	గోబిపువ్వు	40	60
పాలకూర	30	50	బీట్‌రూట్	30	50
మెంతికూర	70	90	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	60	80	చిక్కుడుకాయ	50	70
పుదీనా	50	70			

– ఇందూరు

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	1920 హర్రర్ ఆఫ్ ది హార్ట్ -10.50.4.30. 1.30.10.15 అశ్విన్స్ -7.30
స్క్రీన్-2	ఆదిపురుష్(తెలుగు) -1.39.7.39
స్క్రీన్-3	ఆది పురుష్(తెలుగు)- 1.30.7.10 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆదిపురుష్(తెలుగు) 3డీ – 11.15.3.00 6.45.10.30
స్క్రీన్-2	-ఆదిపురుష్(తెలుగు)3డీ -10.15 2.00 5.45 9.30
స్క్రీన్-3	భీమదేవరపల్లి బ్రాంచి (తెలుగు)- 11.10.7.10 1920 హర్రర్ ఆఫ్ ది హార్ట్ (హిందీ)-2.05.10.05 ఎలిమేట్(ఇంగ్లీష్)2డీ -4.50
స్క్రీన్-4	ఎలిమేట్(ఇంగ్లీష్)2డీ-11.00 కుట్ర(తెలుగు)-1.20 ది ఫ్లాష్(ఇంగ్లీష్)-3.45 భారీ తార ఘనా -(తెలుగు)-6.55 అశ్విన్స్(తెలుగు)-10.00
దేవి	అశ్విన్స్(తెలుగు)
నటరాజ్	1920 హర్రర్ ఆఫ్ ది హార్ట్(తెలుగు)
లలితామహల్	మను చరిత్ర
విజయ్	ఆది పురుష్ (తెలుగు)

సంక్షిప్తం

'విద్యను వ్యాపారం చేస్తున్నారు'



సిరికొండ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను పూర్తిగా వ్యాపారమయంగా మారుస్తున్నా రని ఎస్ఎఫ్ఐ జిల్లా కా ర్యదర్శి బోడ అనిల్‌కుమార్ ఆరోపించారు. మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ మండల సమావేశం శనివారం నిర్వహించారు. మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా భానుప్రసాద్, కార్యదర్శిగా దిలీప్, ఉపాధ్యక్షురాలిగా పూజ, దీపిక, జా యింట్ సెక్రటరీగా శివ, గణేష్, సభ్యులుగా వరుణ్, జ్ఞానేశ్వర్, కృతిక, అఖిల, గంగను ఎన్నుకున్నారు.

వీఆర్ఏల కార్యవర్గం ఎన్నిక



సుభాష్‌నగర్ : గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) నిజామాబాద్ డివిజన్ సమావేశం నగరంలోని రెవెన్యూభవన్‌లో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ గౌరవాధ్యక్షుడిగా దయాసాగర్, అధ్యక్షుడిగా చెలిమెల రాములు, ప్రధానకార్యదర్శిగా బియ్య సాయినాథ్, కోశాధికారిగా గంగాధర్, ఉపాధ్యక్షులుగా సిలార్ మహ్మద్, జాయింట్ సెక్రటరీగా ప్రశాంత్, కార్యవర్గ సభ్యులుగా రాజేశ్వర్, ఏర్గం సాయిలు, ముఖ్య సలహాదారులుగా పెంటయ్య, హరిచరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాట్లాడుతూ వీఆర్ఏలందరూ ఐక్యంగా ఉన్నప్పుడే డిమాండ్లు సాధించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు ఉండవద్దు



మోపాల్(నిజామాబాద్‌రూరల్) : గ్రామాల్లోని ఓటరు జాబితాల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా బీఎల్ఓలు చూడాలని నిజామాబాద్ ఆర్డీఓ రవి సూచించారు. శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో రూరల్ నియోజకవర్గస్థాయి రాజకీయ నాయకుల ప్రతినిధులు, తహసీల్దార్లతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రవి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బీఎల్ఓలు నిర్వహించిన ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులు సర్వే చేసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు బూత్ లెవల్ వారీగా ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ఓటరుజాబితాలో చనిపోయిన వారు పేర్లు తీసేసి కొత్త జాబితాను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో తహశీల్దార్లు శ్రీనివాస్‌రావు, లత, గంగాసాగర్, గఫర్ ఖాన్, మల్లేష్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.